# రామి

- బాల సరస్వతి



"అమ్మా-- అన్నం బెడుదూరావే" కొండని పిలుపుకు పరిగెత్తుకొచ్చింది రామి.

"రాజత్తతోటి నువ్వు పట్నంబోతున్నవని చెప్పేటందుకు పోయిన" కంచంలో వడ్డిస్తూ చెప్పింది.

"ఈ తల్లె (కంచం) కొత్తగా మెరుత్తుంది- ఎక్కడిదే".

నీకోసరం తెచ్చిన కొడుకా- ఇక్కడ్నంటె ఎవ్వరు సూడరు. మల్లక్కడ అందరు ఇస్టీలు వాట్లల్ల దినుకుంట నువ్వు రాతెండి వాట్లల్ల దింటె ఎక్కిరియ్యర్ర. "కడుపు నిండదినుం. పట్నం జేరెటరకు ఎంతసేపయితదా".

కొండడు కంచంలో కలుపుతున్నాడు కానీ తిండి సయించడం లేదు. అప్రయత్నంగా కంటి వెంబడి నీళ్ళొచ్చినయి.

"ఏమైంది బిడ్డ-- ఏం ఫికరు పెట్టుకోకు."

"అమ్మా-- నిన్నిడిసిపోనే" చంటి పిల్లాడిలా ఏడ్చాడు "నేను పోతె నువ్వు ఉండి దినవు-- నాకెరికె నీ సంగతి" వెక్కుతూ అన్నాడు కొండడు.

"కొండా- నిజంగ నేను మంచిగనే వుంట- నీతోడు. నా మీద మనుసువెట్కోక మంచిగ పని జేసి మంచి పేర దెచ్చుకో-- నువ్వు పట్నం బొయ్యేది మనం మంచిగ బతికేటందుకె గద బిడ్డ- జెర వూరుకో" ఓదార్చింది. "ఆ యింత తలెల్ది మొత్తందినుం కొడ్క-- ఊరికి పోవుకుంట బువ్వ పడెయ్యొద్దు."

"ఒరే కొండిగా-- టయమైంది-- ఇయ్యాల గదుల్తవాలేదా- రామత్తా... మీ తల్లిగొడుకుల ముచ్చట్లు బడిశేటట్లు లేవు. మల్ల రాకుండనే బోతడా ఏంది నీ కొడుకు" బయటనుండే మొదలెట్టి గుడిసె లోపలికి వచ్చేదాకా సాగదీసిండు మల్లిగాడు.

"ఈనికిదేం పోయేకాలం... తేలుకు పెత్తనమచ్చి తెల్లందాక గుట్టిందని బోడి పెత్తనం జూపిచ్చుకుంట కాని మాటలు గూత్తుండు" మల్లిగాన్ని గట్టిగా అనలేక సన్నగా గునుక్కుంది రామి.

"అమ్మా... సంచిల అన్ని సదిర్నావె" చెయ్యి కడుక్కుంటూ అడిగాడు కొండడు.

"ఇదొక్కటి మిగిలింది" అంటూ కొండడు తిన్న కంచం కడిగి, సంచీలో పెట్టింది రామి. "మొదటి జీతం రాంగానె ఓ పొడూ లాగు కొనుక్కోరా"

"సరేనే... ఇగ నేను పోత మరి"

"పోత అనద్దురా... పొయ్యొస్త అనాలె" నొచ్చుకుంది రామి. "నేనుగూడ టేసను దాక వస్త"అంటూ వాళ్ళతో బయలుదేరింది రామి.

తల్లి తనతో ఎంతసేపుంటే అంత బాగుండుననుకున్న కొండడు వద్దనలేదు.

ఆ జాగ్రత్తా ఈ జాగ్రత్తా చెప్తూండగానే రైలు వచ్చేసింది.

"అమ్మా-- ఇగనేను పొయ్యొస్త"

"మంచిదిరా-- జెర పైలం-- పెయ్యిగాపాడుకో" కన్నీళ్ళు కనబడకుండా మొగం చాటేసుకుంది రామి.

హడావిడిగా మల్లిగానితోటి రైలెక్కిండు కొండడు.

"గైండ్ల నిలబడకు బిడ్డ... సొలుగుతవు" అంటున్న రామి దృష్టి ద్వారం పైన అతికించిన "మాంకాళమ్మ జాతర పోస్టరు మీద పడింది." నా కొడుకును మంచిగ జూడుతల్లి" క్షణం సేపు మనసులో దండం బెట్టుకుంది.

"అమ్మా-- ఇగ నేను పొయ్యొస్త" రైలు కూత పెట్టగానే మరోసారి చెప్పిండు కొండడు. కదులుతున్న రైలు వెంట నడుస్తూ ఏవేవో జాగ్రత్తలు చెప్తున్నా. తల్లిని విడిచి వుండాల్సి వస్తున్న దుఃఖంలో కొండని కవేవీ కనిపించలేదు.

రైలు వేగం పుంజుకున్నాక అక్కడే ఓచోట కూలబడింది.

"కొడుక... ఎక్కడుండెటోనివో... నా యసుంటి గతి లేని దాన్ని పాల్న వడితివి" గతం గుర్తుకొచ్చింది రామికి.

వాడు పుట్టిన అయ్యఅవ్వ దెగ్గరుంటె యిప్పటివరకు మారాజోలె వుండేటోడు గావొచ్చు. ఏ సదువులు సదివేటోడో-- ఏ రాజ్యాలేలెటోడో".

వాడు తన కండ్లబడ్డపుడు రెండురోజుల గుడ్డుగా వచ్చు. ఇప్పటికి ఇరువై ఏండ్లయింది. సుట్టాల పెండ్లికి పట్నంబోయి రాంగ రైలుటేసన్ల ఏడుత్తుండు. కొంచెం సేపు సూసింది. తరువాత ఎత్తుకుంది. వోటల్ల పాలుగొనుక్కొచ్చ దూది తోటి తడిపి తాపింది. ఎంతసేపు జూసినా వానికోసం ఎవ్వరు రాలే. ఎవ్వరి నడిగినా "మా పిల్లగాడు గా"దన్నరు.

ఆకరుకు అర్థమయింది. వాన్ని ఎవతో కనిపడేసిందని. ఆ తర్వాత ఎంబడిదెచ్చుకుంది నాలుగిండ్లల్ల పాచి పనిచేసి రోజు గిన్ని పాలు దెచ్చిపోసింది. కంటికి రెప్పకంటె ఎక్కువగ జూసుకుంది.

తనే ఆ బిడ్డను గంటె అంతకంటె తక్కువనే జూసుతండెగావొచ్చు. ఎవలి దగ్గెరుండెటోడో. మారాజు పుట్టువడి. ఎంత ముద్దుగుండెనో. 'బంగారి కొండ'అని పిల్చుకుంది. అదే పేరు "కొండ డ"యింది. వాన్ని దెచ్చుకున్న కొత్తల ఎందరో ఎన్నో అన్నరు.

"ఆc-- దానికేం పిల్లా... పీచా- ఎట్లైనా పిల్లలుగారని ఎవున్నో ఎత్తుకొచ్చింది"

"అయినా పుడితె కొడుకయితడు గని ఎత్తుకొచ్చుకుంటె కొడుకయితడా యేంది"

ఇటువంటి మాటలు ఎన్నో విన్నది. తాగుడు దప్ప మరో యావ లేని మొగనితోటి సంసారం జెయ్యవడ్తి. పిల్లలు గాకపోతె నాదేం తప్పు" అనుకుంది.

"కాపురంబట్టి కనిపారేసిందాని కొడుక్కు కన్నతల్లి పోలికలొస్తయిగని దీని పోలిక లొస్తయా" అన్నారెవరో- తను పట్టించుకోలే.

ఓరోజు బాగ దాగొచ్చి "పోరన్నియ్యి-- వాని అయ్య అవ్వ వచ్చింద్రు-- తోలుక పోతరట" అన్నడు మొగడు. "వచ్చినోండ్లను తోలుక రాపో"అన్నది గని కొండన్ని యియ్యలే. తిట్టిండు. కొట్టిండు. సప్పుడు జెయ్యకుండ నోర్మూసుకున్నది గని యియ్యలే.

తనకెరికే దాని సంగతి. పోరన్ని తీసుకపొయ్యి అమ్ముకోని బాగ తాగి తండదానాలాడుదామనుకున్నడు దొంగ గాడ్దికొడుకు. ఆనికంత ఎర్రెదానోలె కన్పించింది తను. అన్ని పట్టించుకోలే... పట్టించుకున్నది ఒక్కన్నే.. కొండిగాన్ని.

వాడు అంబాడినా, అడుగులేసినా మురిసిపోయింది తను. "అమ్మా" అని పిలిచిన రోజు ఎంతానందమైంది తనకు. ఇగ తను గొడ్డుది గాదు అనుకుంది.

కొండడు ఆరేండ్లోడయిండు. వానితోటి పోరలు వానికి తల్లిదండ్రి లేరని ఎక్కిరిచ్చింద్రు. వీల్లు కొండన్ని సెడగొడ్తరని యాడికన్న పొయ్యి బతుకుదామనుకుంది తను.

"ఎవునితోటో లేసిపోయిందని" బద్నాం వస్తదని ఎల్లిపోలే.

తాగేతాగే మొగుడు సచ్చిపోయిండు. పెద్దగా బాధ పడ్లేదు. ఉన్న కొడుకును జూస్కోని బతుకుదామనుకుంది. మంది అట్లగూడ బతుకునియ్యలే. ఓరోజు "బయవ్వా.. నువు నా యమ్మవు గాదట్నే" అని ఏడ్సుకుంట వచ్చిండు కొండడు.

ఆరోజే ఓ ఆలోచన జేసింది. వూరు నాశ్నమైపోను. ఆడుంటి కొండన్ని జెడగొడ్తరు. "అయినా అసలోడె సచ్చిపాయె. అత్తగారూరు తోటి తనకేంపని" అనుకుంది. అనుకున్నరోజు రాత్తిరికి రాత్తిరి కొండన్ని, రెండు చీరలు, తప్పాల ముంత సర్దుకోని రైలెక్కి యీ వూర్ల దిగింది.

ఏమనుకున్నరో ఆ వూర్లె... అనుకోనీ... సావనీ...

నోరు మంచిదైతె ఊరు మంచిదైతది. పది పద్నాలుగేండ్లైంది యీడికొచ్చి. ఒక్కండ్లుగూడ తనను ఏలెత్తి సూపలే.

దొర్సానుల ఇండ్లల్ల పాచిపని మొదలెట్టింది. పోరన్ని ఎంబడి పెట్కోని పోతె "రామి...నీకంటె నీ కొడుకు మంచి గున్నడె... జాంపండోలె ముద్దొస్తడు" అనేటోండ్లు అమ్మగార్లు. "అంత వాని తండ్రి పోలికలున్నయమ్మ"అని జెప్పింది తను. బేఫికరు! తన మొగడు ఎవుడో వీండ్లకు తెలువది గద!

కొండడు గూడ అస్సల లొల్లిజెయ్యకపోతుండె. వద్దన్నా వినకుండ నీల్లు మోస్తుండె. తనకు పనిల సాయం జేస్తుండె.

ఇట్ల తనెంబడి వస్తుండని యిస్కూల్ల పట్టించింది తను. ఆ పంతులుగాడు పోరన్ని కొట్టిండని మానిపిచ్చిందిగని లేకపోతే 'ఈరో'అయితుండెగావొచ్చు.



★ మహాలక్ష్మి విలాస రసం 250 -500 మి.గ్రా. రోజుకు 3సార్లు తేనెతో సేవిస్తే క్షయ వ్యాధికి ఉపశమనంగా ఉంటుంది.

